# బలి

కొమ్మిడి మత్స్యేంద్ర రెడ్డి



ఆ చౌరస్తాకు ఎడమవైపున వరసగా సీతాఫలాలు, మామిడి, ఖర్బూజ, కొబ్బరి బోండాలు— ఇలా...ఇలా ఏ సీజన్లో నయినా సరే, గర్భిణీ స్త్రీలలా నిండుగా ఉండే తోపుడుబండ్లు...వాటి పైనా, క్రిందా, పక్కనా, వెనకాలా...చిన్నా పెద్దా, వివిధ మనస్తత్వాలు నింపుకున్న మనుష్యులూ...

పూర్తిగా మాసిన చిరుగులు పట్టిన బట్టల్తో, దినానికి ఇరవైనాలుగు గంటలూ సారా కంపుకొడుతూ ఎండు పుల్లల్లాంటి మగవాళ్ళూ...

వారికి పూర్తి వ్యతిరేకంగా—బలిసిన శరీరాలతో, పుష్టిగా పెరిగిన అవయవాలతో, తైల సంస్కారం లేని తలలతో, మురికి పేరుకుపోయిన పైట చెంగులను ఎప్పుడూ చేతుల్లోనే పట్టుకుని, ముడులు లేని రైకల్లోంచి నిండైన రొమ్ములు సగానికి సగం...అప్పుడప్పుడు పూర్తిగా బయటకు కనిపిస్తూంటే పట్టించుకోకుండా నేలపై చతికిలబడి, వచ్చిపోయే వాళ్ళతో బూతు సరసాలాడుతూ ఆడవాళ్ళూ...

డ్రైనేజీ మడుగుల్లో దొర్లుతూ, అందులో జలకాలాడే జీవాలతో దొంగాట లాడుకుంటూన్న బాలబాలికలూ...

ఆ దృశ్యానికి నేపథ్యంగా నిలిచి ఉన్న పూరి గుడిసెలు...వాకిళ్ళలోని కుక్కి మంచాల్లో పడి మూలుగుతున్న ముసలీ...ముతకా!

సంవత్సరం క్రితం ఆ పరిసరాలంటేనే విపరీతమైన జుగుప్స వేసేది.

"పరిసరాలతో ఏం పనోయ్...? మన మేమైనా వాహ్యాళికి వెళ్తున్నామా..ఇలా వెళ్ళి, అలా వచ్చేయడమే..." అంటూ బలవంతంగా లాక్కెళ్ళాడు కృష్ణమూర్తి ఒకరోజు.

తోపుడు బండ్ల మధ్య నుండి, రకరకాల ప్రాణులను తప్పుకుంటూ వెళ్ళారిద్దరూ. ఒక గుడిసె ముందు పదిమంది దాకా నిలుచుని ఉన్నారు. కొందరు లోనికి వెళ్తున్నారు...అయిదు నిమిషాల్లో బయటకు వచ్చి, వెనక్కి చూడకుండా వెళ్ళిపోతున్నారు. అక్కడ ఉన్న కాసేపట్లోనే దాదాపు పాతిక మంది దాకా వెళ్ళొచ్చారు.

"ఇలా నిలబడితే మనమిలాగే ఉండిపోగలము. పద...!" అంటూ లోనికి దారి తీశాడు కృష్ణమూర్తి.

